క్లుప్తంగా

సాతాపూర్‌ను మండలం చేయాలి



పెద్దకొత్తపల్లి: సాతాపూర్ గ్రామాన్ని నూతన మండలంగా ఏర్పాటు చేయాలని అన్ని పార్టీల నాయకులు బైక్ ర్యాలీ చేపట్టి సోమవారం జిల్లా కేంద్రంలో కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. వీరయ్య మాట్లాడుతూ సాతాపూర్ చుట్టూ 10 గ్రామాలు, మండలాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వ భూములు కూడా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో పరమేష్, తిరుమల్, వంశీగౌడ్, ప్రవీణ్‌కుమార్, మల్లేష్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బహుజనుల అభివృద్ధి



తాడూరు: బహుజనులు అభివృద్ధి చెందాలంటే రాజ్యాధికారమే లక్ష్యంగా పని చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి కుమార్ అన్నారు. సోమవారం ఆయా గ్రామాలను సందర్శించారు. 21న రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మండల కేంద్రంతోపాటు గ్రామాలలో పర్యటించనున్నారని, యాత్రలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. వారసత్వ రాజకీయాలను నియోజకవర్గంలో తిప్పికొట్టి, ప్రజలు ఆలోచించి బహుజన రాజ్యాధికార దిశగా అడుగులు వేయాలన్నారు. కార్యక్రమంలో రాము, మహేష్, బాలు, భాస్కర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు వైద్యం చేస్తున్న పశుమిత్రలకు కనీస వేతనం ఇవ్వాలని పశుమిత్ర జిల్లా అధ్యక్షురాలు చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి డీఆర్‌డీఓ నర్సింగరావుకు వినతిపత్రం అందజేశారు. పశుమిత్రలను వర్కర్లుగా గుర్తించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, 3 జతల కోడ్ దుస్తులు ఇవ్వాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో అశోక్, మంజుల, రాధ, గీత, వసంత, కృష్ణవేణి, చరిత, అనిత, యశోద పాల్గొన్నారు.

టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తొలగించండి

కందనూలు: ప్రశ్నాపత్రాల లీకేజీకి కారకుడైన టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డిని పదవి నుంచి తొలగించాలని సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో డీఆర్‌డీఓ నర్సింగరావుకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. యూత్ కాంగ్రెస్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాము మాట్లాడుతూ.. ప్రశ్నాపత్రం లీకేజీ వల్ల 30 లక్షలు మంది నిరుద్యోగుల జీవితాలు రోడ్డున పడ్డాయన్నారు. బాధ్యులైన వారిపై వెంటనే కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్‌గౌడ్, కౌన్సిలర్ సునీంద్ర, సుల్తాన్, దినేష్, మస్తాన్, జయకృష్ణ, శివప్రసాద్, మణిదీప్, వేణు పాల్గొన్నారు.

ఠాను నాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై పెట్టాలి



కొల్లాపూర్: తెలంగాణలోని పీడిత ప్రజల కోసం పోరాటం చేసిన ఠాను నాయక్ విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం పట్టణంలోని గిరిజనభవన్ వద్ద ఠానునాయక్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడిన యోధుడు ఠానునాయక్ అని కొనియాడారు. కార్యక్రమంలో భాషానాయక్, బన్నీ, సురేష్, ప్రవీణ్, రామచందర్, సూర్య తదితరులు పాల్గొన్నారు.

మసీద్ ప్రారంభం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతలపల్లిలో కొత్తగా నిర్మించిన మసీద్-ఏ-మదీనాను సోమవారం మత గురువు సోఫీ హాషిమ్ సత్తారి, మైనార్టీ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం నమాజ్ చేశారు. ఆయన మాట్లాడుతూ దేవునిపై ప్రతి ఒక్కరు భక్తిభావంతో ఉండాలన్నారు. ప్రతి రోజు నమాజ్ చేయడంతో మనలోని చెడు ఆలోచనలు తొలగిపోతాయన్నారు.

పప్పుధాన్యాల సాగు లాభదాయకం

కొల్లాపూర్: పప్పు ధాన్యాల సాగుద్వారా అధిక లాభాలు పొందవచ్చని ఏఓ నాగరాజు, మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి, రైతుబంధు సమితి కోఆర్డినేటర్ నిరంజన్, సింగిల్ విండో చైర్మన్ కృష్ణయ్య రైతులకు సూచించారు. సోమవారం పట్టణంలోని రైతువేదిక భవనంలో పప్పు ధాన్యాల సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. సాగు విధానాలు, దిగుబడి అంశాలు, మద్దతు ధరల గురించి ఏఓ రైతులకు వివరించారు. జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా మండలంలోని రైతులు ఎండాకాలంలో పంట వేసుకునేందుకు అనువైన వీబీఎన్-8 రకం మినుము విత్తనాలను ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఎకరాకు మూడు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ఈ విత్తనాలను మండలంలోని పది రైతు వేదికల పరిధిలోని రైతులకు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో స్వామిరెడ్డి, లక్ష్మయ్య, రాముడు, వెంకటేశ్వర్లు, ఖాదర్, రాఘవరెడ్డి తదితరులున్నారు.



లట్టుపల్లిలో రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏఈఓ అఖిల్

రైతులకు సబ్సిడీ మినుముల పంపిణీ

బిజినేపల్లి: జాతీయ ఆహార భద్రత పథకం కింద వీబీఎన్-8 రకం సబ్సిడీ మినుములను మండలంలోని లట్టుపల్లిలో ఏఈఓ అఖిల్ రైతులకు పంపిణీ చేశారు. వందశాతం సబ్సిడీతో యాసంగిలో మినుములు సాగు చేయాలనుకునే రైతులకు అందించారు. 65 నుండి 75 రోజుల పంట కాలం ఉండే మినుము పంట కోసం ఎకరాకు 4 కేజీల విత్తనం చల్లుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచించారు.



కొల్లాపూర్‌లో..

పప్పు ధాన్యం విత్తనాల పంపిణీ

లింగాల: వేసవిలో పప్పు ధాన్యం పంటను సాగు చేసేందుకు మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో సోమవారం మండలంలోని వల్లభాపూర్ రైతువేదికలో వంద శాతం రాయితీపై రైతులకు పప్పు ధాన్యం విత్తనాలను పంపిణీ చేశారు. ఏఈఓ శ్రీనిధి మాట్లాడుతూ వీబీఎన్-8 రకం మినుము విత్తనాలను వాటితో పాటు విత్తన శుద్ధికి అవసరమైన రైజోబియం మందును అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ధర్మారెడ్డి, చంద్రయ్య, రైతులు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలి

వెల్దండ: రైతులు సాగుచేసే పంటల్లో నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని సర్పంచ్ భూపతిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని రైతు వేదికల్లో ప్రభుత్వం సబ్సిడీపై అందించిన పప్పు దినుసులను పూర్తి సబ్సిడీతో వచ్చిన వాటిని సర్పంచ్ రైతులకు పంపిణీ చేశారు. ఏఈఓలు సురేష్‌గౌడు, గణేష్, రైతులు తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ ప్రహరీ కూల్చివేత



కొల్లాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వెనుక భాగంలో గల ప్రహరీని సోమవారం మున్సిపల్ అధికారులు కూల్చివేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా కూల్చివేతలు చేపట్టారు. ఆప్రాంతంలో కొత్తగా సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణాలు చేపట్టారు.

గుండెపోటు మరణాలపై ప్రభుత్వం స్పందించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: గుండెపోటు మరణాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నాయని, వీటికి సంబంధించిన కారణాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం నాయకుడు నిరంజన్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. చాలా మంది ఈ మధ్య కాలంలో గుండె పోటుతో మరణిస్తున్నారని, ఒకప్పుడు వయస్సు పైబడిన వారికే గుండె పోటు వచ్చేదన్నారు. రాష్ట్రంలో 10 రోజుల్లోనే చాలా మంది గుండె పోటుతో మరణించారని దీన్ని ప్రమాద మరణాలుగా ప్రభుత్వం గుర్తించి, బాధిత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, లక్ష్మయ్య, సుధాకర్‌గౌడ్, నిరంజన్‌యాదవ్, కొ్రట శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా ప్రాంగణం శుభ్రం చేయాలని వినతి

తెలకపల్లి: మండలంలోని నడిగడ్డ శివారులో ఉన్న క్రీడా ప్రాంగణం అపరిశుభ్రంగా ఉందని బీఎస్పీ మండల అధ్యక్షుడు శివశంకర్ తెలిపారు. సోమవారం ఎంపీడీఓ చెన్నమ్మకు నాయకులు వినతిపత్రం అందించారు. మండలంలోని ఉన్న క్రీడా ప్రాంగణాలు బోర్డులకు మాత్రమే పరిమితం అయ్యాయని, నడిగడ్డలో ఉన్న క్రీడాప్రాంగణంలో విపరీతంగా చెట్లు, రాళ్లు ఉండడమే కాకుండా భూమి ఎగుడుదిగుడుగా ఉందన్నారు. కార్యక్రమంలో విష్ణు, శ్రీకాంత్, రాము, భాను తదితరులు పాల్గొన్నారు.

నేల కొరిగిన మొక్కజొన్న

బిజినేపల్లి: తిమ్మాజిపేట మండలంలోని ఆర్సీతండాలో కురిసిన వర్షాలకు నేలకొరిగిన మొక్కజొన్న పంట అధికారులు సోమవారం పరిశీలించారు. రాజు, మాన్య, లక్ష్మణ్‌కు చెందిన దాదాపు 10 ఎకరాల మొక్కజొన్న పంట ఈదురు గాలులతో కూడి వర్షానికి నేలకు ఒరిగినట్లు ఏఈఓ సాయిరాం వివరించారు. పంట నష్టంపై ఉన్నతాధికారులు నివేదిస్తామని తెలిపారు. ఇంకా ఏమైన పంట నష్టం అయితే రైతులు వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

25న నాగర్‌కర్నూల్ బంద్

అచ్చంపేట రూరల్: నిఖిత మృతికి కారణమైన దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సోట కాశీం డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ కేసును హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. మొదటిసారి పోస్టుమార్టం చేసిన డాక్టర్‌ను సస్పెండ్ చేయాలన్నారు. ఈనెల 25న నిర్వహించే నాగర్‌కర్నూల్ పట్టణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో అంజి, రాంబాబు, శ్రీకాంత్, శరణ్, అనిల్, రాజేష్, రమేష్ పాల్గొన్నారు.

కొల్లాపూర్: గురుకుల పాఠశాలలో నిఖిత హత్యకు గురైన ఘటనపై సమగ్ర విచారణ చేసి, దోషులను శిక్షించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో దళిత సంఘాల నాయకులతో సమావేశమయ్యారు. నిఖిత మృతికి నిరసనగా ఈనెల 25న నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంతో పాటు అచ్చంపేట, అమ్రాబాద్ మండల కేంద్రాల్లో బంద్ నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. బంద్‌లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

కల్వకుర్తిరూరల్: నియోజకవర్గ సమగ్రాభివృద్ధే తన ధ్యేయమని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. సోమవారం ఎంపీపీ మనోహర అధ్యక్షతన పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎజెండాలోని అంశాల వారీగా అధికారులతో మాట్లాడారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేలా అధికారులు పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు.

సభలో వాగ్వాదం

సభలో గుండూరు ఎంపీటీసీ సభ్యుడు నర్సిరెడ్డి అసంపూర్తిగా ఉన్న రోడ్డును వేయాలని పట్టుబట్టారు. 4ఏళ్లుగా రోడ్డు పనులు ఎందుకు చేపట్టడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాటు మహిళా సంఘాల మార్పు, మొకురాల పాఠశాల భవనం సమస్యలపై ఎమ్మెల్యేను ప్రశ్నించారు. ఎమ్మెల్యే స్పందించిస్తూ స్పెషల్ డెవలప్‌మెంట్ నిధుల నుంచి అసంపూర్తి రోడ్డుకు రూ.80 లక్షలు మంజూరు చేయించానని లేఖ చూపించారు. అదంతా ఉట్టిదేనని చెబుతూ నర్సిరెడ్డి సభలో బైఠాయించారు. వైస్ ఎంపీపీ గోవర్ధన్ కల్పించుకుని మాట్లాడారు. నిధులు మంజూరు చేసినా ఆందోళన ఎందుకని ప్రశ్నించడంతో ఇరువురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అనంతరం సభ్యులు నచ్చజెప్పడంతో సమస్య సద్దుమనిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలో 37 బస్తీ, పల్లె దవాఖాలు మంజూరు చేయించామన్నారు. ఒక్కో ఆస్పత్రి భవన నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు మంజూరు కావడంతో పాటు వైద్యులు, సిబ్బంది నియామకం చేస్తున్నామన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బైఠాయించిన నర్సిరెడ్డి

మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలి

కల్వకుర్తి రూరల్: లక్షలాది మంది నిరుద్యోగులను మోసం చేసేలా జరిగిన పేపర్ లీక్ వ్యవహారంలో రాష్ట్ర మంత్రి కేటీఆర్‌ను వెంటనే మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని, లీకేజీ వ్యవహారంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీజేపీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు.

బీజేపీలోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యం

కొల్లాపూర్: బీజేపీలోనే దళితులకు రాజకీయ ప్రాధాన్యం ఉంటుందని దళిత మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్.కుమార్ అన్నారు. సోమవారం పట్టణంలోని ఫంక్షన్‌హాల్‌లో దళిత మోర్చా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎస్.కుమార్‌తో పాటు దళితమోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుబాషా ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. పార్టీలో దళితులకు రాజకీయ ప్రాధాన్యం ఉంటుందనేందుకు ఎన్నో ఉదాహరణలు ఉన్నాయన్నారు.

కొల్లాపూర్‌లోని ఆర్డీఓ కార్యాలయం ఎదుట బీజేవైఎం నాయకులు నిరసన దీక్షలు చేపట్టారు. టీఎస్‌పీఎస్‌సీలో ప్రశ్నాపత్రాల లీకేజీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో భరత్‌చంద్ర, పరశురాం, మహేష్, సత్యనారాయణగౌడ్, ఇమ్రాన్, శివకృష్ణయాదవ్ తదితరులున్నారు.

అచ్చంపేట రూరల్: ప్రశ్నా పత్రాల లీకేజీ వ్యవహారంలో నిరుద్యోగ యువత నష్టపోయారని, రూ.లక్ష చొప్పున నష్టపరిహారం చెల్లించాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీఓ కార్యాలయం ఎదుట ప్రశ్నాపత్రాల బీజేపీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. కార్యక్రమంలో బాలాజీ, మంగ్యా నాయక్, రేణయ్య, రవీందర్, శివచంద్ర, దేవేందర్‌రెడ్డి, అంజి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటం

నాగర్‌కర్నూల్ రూరల్: కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.శ్రీనివాసులు, ఆంజనేయులు, ఎం.శ్రీనివాసులు తెలిపారు. ఈ మేరకు వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్రమోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా వ్యతిరేక విధానాలను పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని ఆరోపించారు. లేబర్ కోడ్‌లను, రైతు చట్టాల అమలు, ఉపాధి హామీ పనులను నీరుగార్చడం వంటి అంశాలపై కార్మిక, కర్షక, సంఘర్ష ర్యాలీ పేరుతో ఢిల్లీ నడిబొడ్డున 5 లక్షల మందితో భారీ ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్య వాదులు, సామాజిక శక్తులు ఐక్యంగా కలిసిరావాలని పిలుపునిచ్చారు.



జిల్లా కేంద్రంలో పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

తెలకపల్లి: కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని నెహ్రూ చౌరస్తాలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం, కేవీపీఎస్ ఆధ్వర్యంలో బైక్ యాత్ర మండలంలో కొనసాగుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో అమలు చేస్తున్న కార్పొరేట్, మతోన్మాద అనుకూల విధానాలను కార్మిక, రైతులు, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర చేస్తున్నామన్నారు. లక్ష్మణ్, భాస్కర్, విజయ్‌గౌడ్, మహేష్ పాల్గొన్నారు.

కూలీలు ఉదయాన్నే పనులకు వెళ్లాలి



పెనిమిళ్లలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు



అజిలాపూర్‌లో ఉపాధి హామీ పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాసులు

ఉప్పునుంతల: ఎండలు ముదురుతున్నందున జాతీయ ఉపాధి హామీ పనులకు వెళ్లే కూలీలు ఉదయమే వెళ్లి నిర్దేశించిన విధంగా పనులు పూర్తి చేసుకోవాలని ఎంపీడీఓ లక్ష్మణ్‌రావు సూచించారు. సోమవారం మండలంలోని పెనిమిళ్లలో ఈజీఎస్ పనులను ఎంపీడీఓ పరిశీలించారు. కూలీలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన వెంట కార్యదర్శి వెంకటేష్, టీఏ, ఫీల్డ్ అసిస్టెంట్ ఉన్నారు.

నర్సరీల పరిశీలన

తాడూరు: మండలంలోని గుంతకోడూరు, యాదిరెడ్డిపల్లిలో సోమవారం ఎంపీడీఓ గంగామోహన్ నర్సరీలను పరిశీలించారు. ఆయన నిర్వాహకులకు నాటిన మొక్కల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఎండలు తీవ్రం కావడంతో నర్సరీలో ఉన్న మొక్కలు ఎండిపోయే ప్రమాదం ఉందని గ్రీన్ మ్యాట్ వాడాలన్నారు.

వెల్దండ: వేసవిలో ఉపాధి పని కల్పించి కూలీల సంఖ్యను పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాసులు సూచించారు. సోమవారం మండలంలోని గుండాల, అజిలాపూర్‌లో నర్సరీలు, డంపింగ్‌యార్డు, ఉపాధి హామీ పథకం పనులను పరిశీలించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వేసవిలో రైతులకు, కూలీలకు పనులను కల్పించాలన్నారు. ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డును కల్పించాలన్నారు. కూలీల మస్టర్లను ఆన్‌లైన్ చేసి కూలీడబ్బులు అందేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడ్, కార్యదర్శులు, టీఏలు ఉన్నారు.

ఆలయ అభివృద్ధికి విరాళం

వెల్దండ: మండలంలోని గాన్‌గట్టుతండాలోని వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి సోమవారం ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ రాఘవేందర్‌రెడ్డి రూ.2.50లక్షల విరాళం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఆలయాల్లో పూజలు నిర్వహించుకోవాలన్నారు. ఆలయంలో అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. ఎలాంటి ఆపద వచ్చిన ఫౌండేషన్ అండగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ మారుతి, నాయకులు రమేష్, తరుణ్‌స్వామి, సర్యా, రమేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగుపడుతాయని ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని స్టేడియం గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న కల్వకుర్తి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీల సందర్భంగా సోమవారం క్రీడాకారులను ఆయన పరిచయం చేసుకున్నారు. పోటీలలో గెలుపొందిన జట్టుకు రూ.లక్ష మొదటి బహుమతి అందిస్తానని తెలిపారు.



విరాళం అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

పాఠశాలకు స్వచ్ఛమైన తాగునీరు అందిస్తా

కల్వకుర్తి రూరల్: మండలంలోని మొకురాల పాఠశాల విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీటి కోసం వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తానని ఐక్యతా ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ వరప్రసాద్ తెలిపారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందక రోగాల బారిన పడుతున్నారని గ్రామస్తులు ఫౌండేషన్ దృష్టికి తీసుకెళ్లారు. సోమవారం ఆయన పాఠశాలను సందర్శించారు. హెచ్‌ంతో చర్చించి త్వరలోనే పాఠశాలలో ప్లాంట్ ఏర్పాటు చేస్తామని చెప్పారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఏపీజీవీబీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై కళాజాతా వారు ప్రజలకు అవగాహన కలిపించారు. బ్యాంక్ స్కీం, డిపాజిట్లు, సామాజిక భద్రత పథకాలు, ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన, జీవనజ్యోతి బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, సైబర్ మోసాల గురించి, గోల్డ్‌లోన్, క్రాప్‌లోన్, ఎడ్యుకేషన్ లోన్ గురించి బ్యాంక్ మేనేజర్ వివరించారు. కార్యక్రమంలో రీజనల్ ఆఫీసర్ సురేష్ రెడ్డి, బ్యాంక్ మేనేజర్ రాంగోపాల్‌రెడ్డి, సర్పంచ్ సువర్ణమ్మ, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గి విశ్వనాథం సేవలు మరువలేనివి

చారకొండ: మాజీ సర్పంచ్ దుగ్గి విశ్వనాథం మండల కేంద్రానికి, పరిసర గ్రామాలు, తండాల్లో చేసిన అభివృద్ధి, సేవలు మరువలేనివని సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం విశ్వనాథం జయంతి సందర్భంగా స్తూపం వద్ద పూలమాలలతో నివాళి అర్పించారు. కార్యక్రమంలో అనిల్ కుమార్, శంకరయ్య, యాసిన్, నజీర్, పూలయ్య తదితరులు ఉన్నారు.

దళితబంధు ఇవ్వాలని ఫిర్యాదు

చారకొండ: మండలంలోని జేపల్లికి చెందిన దళిత కుటుంబాలకు దళితబంధు ఇవ్వాలని సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణిలో దరఖాస్తు అందజేశారు. మండలం పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపికైందని, జేపల్లిలో 20 మంది నిరుపేద దళిత కుటుంబాలను అధికారులు గుర్తించలేదన్నారు.

లింగాల: మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి వెలవెలబోయింది. కొన్ని శాఖల వారు మాత్రమే ప్రతి వారం హాజరుకావడం, వచ్చిన వారు ప్రజల నుంచి వినతుల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. ఇచ్చే వినతులకు ఎలాంటి పరిష్కారం లభించకపోవడంతో వినతులు ఇచ్చి లాభం లేదని ప్రజలు భావిస్తున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, డీటీ ముబినా బేగం, ఏఓ నాగార్జునరెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే

కొల్లాపూర్: పట్టణంలోని ఆర్‌ఐడీ ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సోమవారం సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతి, సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని సూచించారు. పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలన్నారు.

బీమా చెక్కుల పంపిణీ

మండలంలోని మొలచింతలపల్లి చెందిన పుట్టపాగ రాము మృతిచెందగా, బీఆర్‌ఎస్ ద్వారా రూ.2లక్షల బీమా మంజూరైంది. చెక్కును ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు.

పెద్దకొత్తపల్లి: గంట్రావుపల్లి చెందిన మత్స్యకార్మికుడు కుర్మయ్య వారం రోజుల క్రితం కృష్ణానదిలో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మత్స్యకార్మిక శాఖ నుంచి మంజూరైన రూ.5 లక్షల చెక్కును మృతుడి తల్లి ఎల్లమ్మకు అందజేశారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజాపాలన

ఉప్పునుంతల: రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజాపాలన అందుతుందని డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ అన్నారు. సోమవారం ఉదయం మండలంలోని అయ్యవారిపల్లితండా, అయ్యవారిపల్లిలో హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక పాలనను ఎండగట్టడానికే రాహుల్ గాంధీ, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అనంతరెడ్డి, నర్సింహరావు, యాదిరెడ్డి, యాదయ్య, వెంకట్‌రెడ్డి, రేణయ్య, రవీందర్, అంజి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో దివ్యాంగుడి మృతి

మన్ననూర్: అమ్రాబాద్ మండలం ఈదులబావి చెందిన యువకుడు చిక్కుడు ఆంజనేయులు (31) దివ్యాంగుడు గుండెపోటుతో సోమవారం మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. యువకుడు కొంతకాలంగా హైదరాబాద్‌లో ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ దివ్యాంగుల సందనంలో ఉంటున్నాడు. తోటి స్నేహితులతో కలిసి ఏడుపాయల జాతరకు వెళ్లినట్లు తెలిపారు. తిరుగు ప్రయాణంలో అనుకోకుండా గుండె నొప్పి రావడంతో అక్కడే ఓ ఆస్పత్రికి తీసుకువెళ్ళారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతుని తల్లిదండ్రులకు సమాచారం తెలియజేసి సొంత గ్రామానికి తీసుకొచ్చారు.

రణభేరీ విజయవంతం చేయండి



చారకొండ: జైభారత్ సామాజిక విప్లవ రణభేరీ రాష్ట్ర సదస్సు ఈనెల 26న సంగారెడ్డిలోని అంబేద్కర్ భవన్‌లో నిర్వహిస్తున్నట్లు జైభారత్ బీసీ పోరాట వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాములుయాదవ్ తెలిపారు. సోమవారం మండలంలోని జూపల్లిలో రణభేరి కరపత్రాలను విడుదల చేసి, అనంతరం గ్రామంలో పంపిణీ చేశారు. హక్కుల సాధన, సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ పోరాట వేదికల ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ సభకు రావాలని కోరారు.

ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యసేవలు



కందనూలు: ఏళ్లుగా ఈ ప్రాంతంలోని పేదలకు మెరుగైన వైద్యం అందించడంతోపాటు ఇతర ప్రాంతాలలో ట్రస్ట్ ద్వారా ఉచిత వైద్యసేవలు అందిస్తామని నాగం దినాకర్‌రెడ్డి చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు నాగం శశిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, పేద ప్రజలకు అండగా నిలుస్తామని తెలిపారు. అనంతరం వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు కార్యక్రమంలో వైద్యులు మీరానాగం, హేమ, శిరీష, శ్రీధర్‌రెడ్డి, వినయ్, అరుణ్ పాల్గొన్నారు.